

పుట్టపర్తిలో వరుస చోరీలు.. ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శనివారం రాత్రి ప్రధాన రహదారి గణేష్ సర్కిల్‌లో కిరాణా దుకాణంలో చోరీ జరి గింది. దుండగులు దుకాణం వెనుక భాగంలో రేకులు తొలగించి చోరీకి పాల్పడ్డా రు. దుకాణం యజమాని సుశీలమ్మ ఆదివారం ఉదయం దుకాణం తెరవగా చోరీ జరిగినట్లు గుర్తించింది. సిగరెట్లు, బీడీలు, నగదు ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ. 30 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఐదు రోజుల క్రితం గణేష్ సర్కిల్ సమీపంలోనే మాధవి టీ బంకులో చోరీ జరిగింది. ప్రధానంగా నగదు, సిగరెట్లు, బీడీలు మాత్రమే ఎత్తుకెళ్లారు. బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గణేష్ సర్కిల్ లో సీసీ కెమెరా ఉండటంతో నేరస్తున్ని గుర్తించ వచ్చుని ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు.

'స్పందన' కరువు

ఏడాదైనా పరిష్కారం కాని సమస్య
ఆసుపత్రి వ్యర్థాలతో భూగర్భజలాలు విషతుల్యం
పొలం నీట మునుగుతోందన్నా నాస్చడే
ఎన్‌హెచ్‌ఆర్‌సిని ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఏదైనా సమస్యను తమ దృష్టికి తీసుకొస్తే 30 రోజుల్లోపు పరిష్కారం చూపడానికి 'స్పందన' అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రకటన చూసి బాధితులు అనేక మంది సోమవారం వచ్చిందంటే చాలు కలెక్టరేట్ కార్యాలయం చేరుకుని వందల అర్జీలు పెట్టుకుంటుంటారు. అయితే అందులో ఎన్ని పరిష్కారమవుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. సమస్యల పరిష్కారం కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఆచరణలో బాధితుల కష్టాలు మాత్రం యధావిధిగాఉంటున్నాయి. కార్యాలయాల చుట్టు తమ సమస్య పరిష్కారం కోసం బాధితులు తిరుగుతూనే ఉండాల్సిన పరిస్థితులు క్షేత్ర స్థాయిలో నెలకొన్నాయి.. అటువంటి సమస్య ఒకటి ప్రజాశక్తి దృష్టికి బాధితులు తీసుకొచ్చారు.



ఆసుపత్రి, సమీప ప్రాంతాల నుంచి వస్తున్న విషతుల్య వ్యర్థాల నీరు

ఏడాదైనా పరిష్కారం లభించలేదు

అనంతపురం రూరల్ మండలం పరిధిలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలో సవేరా కిమ్స్ ఆసుపత్రి ఉంది. దీంతోపాటు కొత్తగా అనేక అపార్టుమెంటులు జాతీయ రహదారికి ఆనుకుని సవేరా ఆసుపత్రి పక్కన ఏర్పాటయ్యాయి. కొత్తగా వెలుస్తున్న నివాస సముదాల నుంచి వచ్చే వ్యర్థాలు వెళ్లే డ్రయినేజీ వ్యవస్థ ఈ పంచాయతీ పరిధిలో లేదు. సహజ సిద్ధంగా ఏటవాలుగానున్న ప్రాంతాల్లోకి కిమ్స్ సవేరా ఆసుపత్రిలోని వ్యర్థాలతోపాటు, ఇతర సముదాయల వ్యర్థాలు లోతట్టు ప్రాంతాల్లో బయటకు వదిలేస్తున్నారు. ఇవి మరోచోటనున్న నివాస ప్రాంతాలతోపాటు, దిగువనున్న వ్యవసాయ భూములను ముంచేస్తున్నాయి. ఈ వ్యర్థాల మూలంగా జాతీయ రహదారి 42 ఆనుకుని ఉన్న తమ నివాస ప్రాంతమైన 'మైస్ విల్లాస్'లోని బోరు నీరు మొత్తం కలుషితమవుతోందని ఆ నివాస సంఘం అధ్యక్షులు రమణ తెలిపారు. దీనిపై ఆయన 2022 మే 30నకలెక్టరు కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. ఎగువ ప్రాంతంలోని డ్రయినేజీ నీరు మొత్తం వచ్చి చేరడంతో తమ బోరులోనున్న నీరు మొత్తం కలుషితమై తాగడానికి కూడా పనికి రాకుండా ఉన్నాయని ఆ అర్జీలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మురుగునీటి కాలువ సౌకర్యం కల్పించాలని కోరారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు సమస్యకు పరిష్కారం లభించలేదు. దీనిపై ఏమి చేయలో బాధితులకు పాలుపోక జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా అధికారులను ఆదేశించింది. ఇప్పటికైనా ఈ సమస్యపై స్పందన ఉంటుందా లేదా అన్నది ప్రశ్నార్థకమేనని బాధితులు రమణ తెలిపారు.

వ్యవసాయ పొలంలో చేరుతున్న మురుగు నీరు

రుద్రంపేట పంచాయతీ పరిధిలోనున్న సవేరా ఆసుపత్రి ప్రాంతం నుంచి వస్తున్న మురుగునీరు దిగువన జాతీయ రహదారి 42 కల్వర్లు కింద నుంచి కక్కలపల్లి పంచాయతీ పరిధిలోకి ప్రవేశించి ఒక వ్యవసాయ పొలంలోకి చేరుతోంది. అక్కడున్న మురుగు నీటి మూలంగా పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. గతేడాది ఈ రకంగా మూడు ఎకరాల్లో వేసిన మిరప పంట మొత్తం దెబ్బతిందని రైతు సుబ్బారెడ్డి తెలిపారు. దీనిపై బాధితుడు అనేక మార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా, అధికారుల, పంచాయతీ సర్పంచి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తమ పొలంలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

ప్రణాళిక లేమితో సమస్య...

ప్రణాళిక లేకుండా నూతన భవన నిర్మాణాలకు అనుమతులను ఆయా సంస్థలు ఇచ్చేస్తున్నాయి. ప్రధానంగా అనంతపురం నగరం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో నివాస సముదాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. అందుకు తగ్గట్టు ఆయా ప్రాంతాల్లో మౌళిక సదుపాయల కల్పన జరగడం లేదు. ప్రధానంగా రహదారి, మురుగు నీటి వ్యసవ్థ ఏర్పాటు ఉండటం లేదు. దీంతో అనుమతులున్నాయని కొనుగోలు చేసిన వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ముందు నుంచి వ్యవసాయ భూములు కలిగి ఉన్న వారి పొలాల్లోకి వ్యర్థాలను వదిలేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉంటున్న వారు సమస్యలను ఎదుర్కొనక తప్పడం లేదు.


తగ్గుతున్న పనిదినాలు



వేతనాల్లోనూ తగ్గుదలే
'ఉపాధి'ని రక్షించాలని సత్యసాయి జిల్లాలో నేడు ఆందోళన
'అనంత'లో ఈనెల 25న నిరసన
విజయవంతం చేయాలని ఎపి వ్యవసాయకార్మిక సంఘం పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధి హామీ పథకం ఒక వరం. పనుల్లేక వలసలు వెలుతున్న వ్యవసాయ కార్మికులకు స్థానికంగా ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో 2004లో వామపక్షాల ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని తీసుకొచ్చింది. దీన్ని అనంతపురం జిల్లాలోనే ప్రారంభించారు. ఈ పథకం వలన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయపు పనుల్లేని సమయాల్లో కూలీలకు పనులు లభిస్తున్నాయి. ఈ పథకాన్ని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ఏదో రకంగా నీరుగార్చే చర్యలు చేపట్టిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోపాటు, తీసుకొస్తున్న మార్పులతో క్రమంగా పనిదినాలు తగ్గిపోతున్నాయి. అదే విధంగా వేతనాలు ఏటా పెరగకపోగా తగ్గుతూ ఉన్నాయి.



ఏటా తగ్గుతున్న పనిదినాలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5.84 లక్షల జాబ్‌కార్డులున్నాయి. 6.66 లక్షల మంది ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో వ్యవసాయ కార్మికులు ఉపాధి పనికెళుతున్నారు. ఇంత పెద్దఎత్తున వ్యవసాయ కార్మికులు పనికెళుతున్న ఈ జిల్లా పరిధిలో ఏటా పనిదినాలు కల్పించిన శాతం చూస్తే తగ్గుతూవస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో పనిదినాల సంఖ్య సగటున 58.62 ఉంది.2020-21 సంవత్సరంలో 66.32 రోజుల పనిదినాలు సగటున కల్పించారు. 2021-22 సంవత్సరంలో ఆ సంఖ్య 62.73 శాతానికి తగ్గింది. ఇక 2022-23 సంవత్సరంలో మరింత తగ్గి 53.84 శాతమే పనిదినాలు లభించాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 23.88 శాతమే ఉండటం గమనార్హం. ఈ రకంగా ఏటా పనిదినాలు ఉమ్మడి జిల్లాలో తగ్గుతూ వస్తున్నాయిః

వేతనాల్లోనూ తగ్గుదల

వేతనాల్లోనూ తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రోజు కూలి ఒక్కొక్కరికి పడింది రూ.208.73 కాగా 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.231.49 పడింది. 2021-22 సంవత్సరంలో అది రూ.225.45కు తగ్గిపోయింది. 2022-23 సంవత్సరానికి వచ్చే సరికి అది మరింత తగ్గి రోజు కూలి రూ.214.79 మాత్రమే సగటున పడింది. ఇక ఈ సంవత్సరం రూ.227.51 ఉన్నట్టు చూపుతున్నా ఏడాది పూర్తయ్యేలోపు ఎంతకు వస్తుందన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే ఈ ఏడాది వేసవి అలవెన్సు కింద ఇచ్చే 30 శాతం వేతనంలో కోత పెట్టింది. అదే విధంగా గునపం పదునుకు ఇచ్చే అలవెన్సు, రవాణా అలవెన్సు అన్నింటిలోనూ కోతలు పెట్టింది.

నేడు సత్యసాయి , ఈనెల 25న అనంతలో వ్యవసాయ కార్మిక సంఘం నిరసనలు

కరువు పీడిత ప్రాంతాల్లోని పేదలకు ఎంతగానో ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగనున్నాయి. ఇది వరకే రెండు జిల్లాల పరిధిలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు క్షేత్ర స్థాయి పరిశీలనలు జరిపారు. ఇందులో అనేక సమస్యలను గుర్తించారు. వీటిని పరిష్కరించడంతోపాటు, ఉపాధి హామీ కింద పనులను విరివిగా కల్పించాలని కోరుతూ సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు అక్కడి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈనెల 25న అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టనున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్వీ సుబ్బారావు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటోందనిశ్రీ సత్య సాయి జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్వీ సుబ్బారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో ఆదివారం మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయరంగంలో తీసుకుంటున్న చర్యలను వివరించారు.



ప్రశ్న : వ్యవసాయ రంగంలో రైతులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జవాబు : వ్యవసాయ రంగంలో ఇటీవల శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు జరిపి వ్యవసాయ రంగంలో విప్లవత్మకమైన మార్పులు తేవడానికి వినూత్న పద్ధతులను సూచించారు. వాటి ద్వారా రైతులకు మేలు చేకూరే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ని మారుతున్న కాలాన్ని బట్టి పురుగు మందుల పిచికారి, ఎరువులు చల్లడానికి, విత్తనాలు విత్తడానికి డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. వాటిని వినియోగించడానికి ప్రత్యేకంగా రిమోట్ పైలెట్‌కు శిక్షణ ఇచ్చి వాటి ద్వారా రైతులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఐదు లక్షల రూపాయల నుండి రూ. 15 లక్షల వ్యయంతో డ్రోన్లను కొనుగోలు చేసుకుని ఆర్‌బికెకు ఒకటి చొప్పున డ్రోన్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని 40 శాతం సబ్సిడీ 10శాతంకాంట్రిబ్యూషన్ 50 శాతం లోన్ సౌకర్యం కల్పిస్తున్నారు. వీటి వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రధానంగా నిరుద్యోగ పట్టభద్రులకు ఇది ఒక మంచి అవకాశం.

ప్ర : వేరుశనగ విత్తన పంపిణీలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రభుత్వం ప్రతి ఏటా విత్తన సేకరణ విషయంలో ఎంతో నాణ్యత ప్రమాణాలను పాటించి సమకూరుస్తోంది. విత్తన వేరుశనగను రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నాం. నాణ్యత 96శాతం మేర ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం. ఈనెల 17 నుండి రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. రైతుల అవసరాన్ని బట్టి డిమాండ్‌కు తగ్గట్టుగా పంపిణీ చేయనున్నాం. ఈనెల 29న జిల్లాలోని 416 రైతు భరోసా కేంద్రాల ద్వారా 16 వేల టన్నుల విత్తన వేరుశనగ పంపిణీకి సిద్ధంగా ఉన్నాం. 40 శాతం రాయితీతో 30 కేజీల బస్తా 1674 రూపాయలకు పంపిణీ చేస్తున్నాం.

ప్ర : నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయిన రైతుల ఆదుకుంటున్నారా?

జ: నాసిరకం విత్తనాలు తీసుకుని చాలామంది రైతులు పంటలను నష్టపోతున్నారు. ఏ కంపెనీ విత్తనాలు తీసుకున్న వాటి బిల్లులు, ఫౌండేషన్ టాగులు, విత్తనాలు వచ్చిన బ్యాగులు భద్రంగా ఉంచుకోవాలి. పంట దిగుబడి రాకపోతే పంట నష్టపోయిన ఆ కంపెనీలపై శాఖ పరంగా చర్యలు తీసుకుంటాం. సత్యసాయి జిల్లా రైతులు ఎక్కువ శాతం కర్నాటక ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే విత్తనాలను తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. కర్నాటకలో విత్తనాలు తీసుకొని నష్టపోయిన రైతుకు మనం ఎలాంటి నష్టపరిహారం ఇప్పించడానికి, కర్నాటక విత్తన ఉత్పత్తి కంపెనీలపై చర్యలు తీసుకోవడానికి వీలు లేదు. రైతులు నష్టపోకుండా కాలానుగుణంగా పంటలు సాగు చేసుకోవాలి. పొద్దు తిరుగుడు పంట మే నెలలో వేయకుండా జూన్ జూలై మాసాల్లో వేసుకోవాలి.



జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్వీ సుబ్బారావు

ప్ర : చిరుధాన్యాల సాగుకు రైతులకు ఎలాంటి ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తి అధికంగా ఉంది.జిల్లాలో 60 వేల హెక్టార్లలో చిరుధాన్యాలు సాగు చేస్తున్నారు.కాలానుగుణంగా వాటి ప్రాధాన్యత పెరుగుతోంది. జిల్లాలో చిరుధాన్యాల సాగులో గతం నుండే ముందంజలో ఉంది.సజ్జలు, జొన్నలు, రాగులు తదితర చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. చిరుధాన్యాల సాగుకు పూర్వవైభవం తీసుకువచ్చేలా వ్యవసాయ అధికారులు కృషి చేస్తున్నారు. దాంతోపాటు రైతులకు మద్దతు ధర ప్రకటించి చిరుధాన్యాల పంటల సాగు పైన రైతుల్లో మక్కువ కల్పించేందుకు అవగాహన కల్పిస్తున్నాం. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం సత్యసాయి జిల్లాలో మరింత పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతు పండించే రాగులకు 3, 580 రూపాయలు మద్దతు ధర ప్రకటించారు.

ప్ర : ప్రభుత్వం వ్యవసాయ రంగంలో ఏ ఏ యంత్రాలను, పరికరాలను రైతులకు పంపిణీ చేస్తోంది ?

జ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు యంత్ర పరికరాలను సబ్సిడీ ద్వారా పంపిణీ చేస్తోంది. జిల్లావ్యాప్తంగా 234 యూనిట్లు ఇప్పటివరకు పంపిణీ చేశాం. వాటిలో ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, వ్యవసాయ పరికరాలు, క్రషర్లు, విత్తన, విత్తన సామాగ్రి, రోటోవేటర్లు, ,టార్పోలిన్ పట్టలు తదితర యంత్రాలను పంపిణీ చేశాం. 40 శాతం సబ్సిడీ 10 శాతం రైతుల కాంట్రిబ్యూషన్ కట్టగా 50 శాతం లోన్ సౌకర్యం కల్పించాం. ఆర్‌బికెల పరిధిలో ఒక్కొక్క యూనిట్ (గ్రూపు) నకు 15 లక్షల రూపాయలు విలువ చేసే యంత్ర సామాగ్రిని పంపిణీ చేస్తున్నాం.

ధర్మవరం కేంద్రంగా దొంగనోట్ల ముద్రణ : మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల



విలేకరులతో మాట్లాడుతున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్


ధర్మవరం కేంద్రంగా 6 నెలలుగా, సత్యసాయి జిల్లా, పక్కజిల్లాలతోపాటు కర్నాటక రాష్ట్రానికి దొంగనోట్లు చెలామణి అవుతున్నాయని ప్రజలే బహిరంగంగా చర్చించుకుంటున్నారని మాజీ ఎమ్మెల్మే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ధర్మవరంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2009-2014 మధ్యలో ధర్మవరంలో దొంగనోట్ల చెలామణి అధికంగా ఉండేదన్నారు. అప్పట్లో దొంగనోట్ల చెలామణి చేసిన వారు ఓ రాజకీయనాయకుడికి ఓ ఇంటిని కూడా నిర్మించి ఇచ్చారని అప్పట్లో చర్చకూడా జరిగిందన్నారు. 2014 ఎన్నికల సమయంలో రూ.500 నోటు తీసుకోవాలంటే ప్రజలు భయాందోళనకు గురయ్యే పరిస్థితి ఉండేదన్నారు. 2014 తరువాత తాము అధికారంలోకి వచ్చాక 2019 వరకు దొంగనోట్ల చెలామణిని పూర్తిగా అరికట్టి ధర్మవరాన్ని ప్రశాంతంగా ఉండేలా చేశామన్నారు 2020 తరువాత తిరిగి ధర్మవరం నియోజకవర్గకేంద్రంగా దొంగనోట్లు చెలామణి, ముద్రణ జరుగుతుందని ప్రజల్లో చర్చజరుగుతోందని వ్యాఖ్యానించారు. ప్రజలకు కావాల్సింది అభివృద్ధి అని దొంగనోట్లు కాదని హితవుపలికారు. ఈ దొంగనోట్ల ముద్రణ, చెలామణిపై చర్యలుతీసుకోవాలని కోరుతూ మోడీ, అమిత్‌షాకు లేఖ పంపుతున్నామన్నారు. ఇప్పటికైనా పోలీసులు వైసీపీకి తొత్తులుగా పనిచేయడం మానుకోవాలన్నారు. దొంగనోట్లు ధర్మవరంలో ఎక్కడ ముద్రిస్తున్నారు.ఏ విధంగా చేస్తున్నారో తెలుసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. కానీ కొందరు పోలీసు అధికారులే వారికి సహకరించే పరిస్థితి ఉందని ఆరోపించారు. అదేవిధంగా దొంగనోట్ల చెలామణి, ముద్రణపై త్వరలో సత్యసాయి జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు గోనుగుంట్ల సూర్యనారాయణ చెప్పారు.

కవిత మృతికి కారకులైన డాక్టర్ లక్ష్మికాంతమ్మను శిక్షించాలి


అనంతపురం కలెక్టరేట్ : గర్భిణి కవిత మృతికి కారకురాలైన డాక్టర్ లక్ష్మికాంతమ్మను అరెస్ట్ చేసి శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వారం రోజుల క్రితం కవిత అనే గర్భిణికి డాక్టర్ లక్ష్మినరసమ్మ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అబార్షన్ చేసిందన్నారు. భార్య భర్తలతో రాతపూర్వకంగా రాయించుకుని రూ.50 వేలు డబ్బులు తీసుకుని పరీక్షలు చేసిందన్నారు. అబార్షన్ చేయడం వల్ల కవిత మృతి చెందిందన్నారు. డబ్బుల కోసం భ్రూణ హత్యలకు పాల్పడుతూ మహిళల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న డాక్టర్ లక్ష్మినరసమ్మ లాంటి వారు జిల్లాలో అనేక మంది డాక్టర్లు ఉన్నారని వారందరిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోని మహిళల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ఇలాంటివి నిర్మూలించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గాలివాన బీభత్సం

పరిగి మండలంలో చెట్టు కూలి గేదె మృతి
అంబేద్కర్ నగర్ లో కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



హిందూపురంలో విరిగిపడ్డ చెట్టు



బత్తలపల్లిలోని మిల్క్ డెయిరీలో ఉడిపోయిన సీలింగ్

ప్రజాశక్తి హిందూపురం, బత్తలపల్లి, పరిగి, ముదిగుబ్బ

హిందూపురం పట్టణంతో పాటు పరిగి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది. వర్షంతో పాటు విపరీతమైన గాలులు రావడంతో ఎక్కడికక్కడ చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని అంబేద్కర్ నగర్ లో గాలి వానకు వేప చెట్టు పడిపోవటంతో ఈ చెట్టు కరెంటు తీగలకు తగులుకొని మూడు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. వర్షం రావడం వలన ప్రజలు ఇళ్ళ లో వున్నందున ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కరెంటు సమస్యను సరిచేయడానికి సుమారు 3 రోజులు పడుతుందని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. ప్రజలు ఈ మూడు రోజులు అందులో ఎండాకాలంలో ఎలా వుండాలి, ఎలా బతకాలని భయపడుతున్నారు. అధికారులు అంబేద్కర్ నగర్‌కు త్వరగా కరెంటు సరఫరా కు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులను కోరుతున్నారు. అంబేద్కర్ సర్కిల్ లో తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారు వర్షం ఎక్కువ కురవడంతో బండ్లను రోడ్డుపై వదిలి పక్కన ఉన్న దుకాణాల్లో వెళ్లారు. విపరీతమైన గాలికి తోపుడు బండ్లు వాహనం తరహా పరుగులెత్తాయి. శ్రీ సత్య సాయి జిల్లా పరిగి మండలం సుబ్బరాయనపల్లి గ్రామంలో భారీగాలులు, వర్షానికి చెట్టు విరిగిపడి రైతు శ్రీరామప్పకు చెందిన గేదె మృతి చెందింది. హిందూపురం పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు గాలులకు కుప్పకూలాయి. ఈ సమయంలో ప్రజలు ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. పట్టణంలో రైల్వే రోడ్డు, ధనలక్ష్మి రోడ్డు, ముక్కడిపేట, చౌడేశ్వరి కాలనీ, కొట్నూరు తదితర ప్రాంతాలలో డ్రయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు అంతా రోడ్డుపైకి రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు డిఇఇ భూపతి తెలిపారు. మురుగు కాలువలు పొంగి పొర్లీ రోడ్డుపై వచ్చిన నీటిని శుభ్రం చేయిండానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు దీని కోసం కొంత మంది కార్మికులను నియమించి శుభ్రం చేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు.

ముదిగుబ్బ మండల కేంద్రంలోని సొసైటీ బ్యాంక్ ఆవరణంలో ఉన్న భారీవృక్షం కూలిపోవటంతో కుమ్మర వీధికి వెళ్లే కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు

బత్తలపల్లిలో గాలి, వాన భీభత్సం

బత్తలపల్లి : మండలంలో పలుచోట్ల గాలి, వాన బీభత్సం సష్టించింది. ఆదివారం సాయంత్రం బత్తలపల్లిలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగండ్లు పడ్డాయి. గుండా కళ్యాణ మండపం ఎదురుగా చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం. ఏర్పడింది. అంతేకాక రైస్ మిల్ ముందర వెనుకన నిర్మించిన ప్రహారీ కూలిపోయింది లింగారెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసిన మిల్క్ డెయిరీలో పలు వస్తువులు దెబ్బతినగా, సీలింగ్ ఊడిపోయింది. గాలి, వానకు విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్లను పోలీసులు జెసిబి సాయంతో పక్కకు తొలగింపజేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరింపజేశారు.



హిందూపురంలో విరిగిపోయిన విద్యుత్‌స్తంభం



నూతన డీఎస్పీ శ్రీనివాసులుకి శుభాకాంక్షలు తెలుపుతున్న శిక్షణ డీఎస్పీ మహేంద్ర

డీఎస్పీని కలిసిన ట్రైయినీ డీఎస్పీ

ధర్మవరం టౌన్: ధర్మవరం నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును ఆదివారం శిక్షణ డీఎస్పీ సాకే మహేంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని డీఎస్పీ ఛాంబర్‌లో డీఎస్పీ శ్రీనివాసులును ట్రైనీ డీఎస్పీ సాకే మహేంద్ర, ఆయన తండ్రి సాకే చిన్నిక్రిష్ణ కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు స్పందన

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో 'స్పందన' కార్యక్రమం సోమవారం యథాతథంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. అలాగే డివిజన్, మండల స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబరు తప్పక జత చేయాలన్నారు. కలెక్టరేట్లో జిల్లా స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని, సమస్యలు సత్వరంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చౌడేశ్వరికి బోనాలు

అమడగూరు : మండల పరిధిలోని రెడ్డివారిపల్లి గ్రామ సమీపంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జ్యోతి, బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అలాగే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

దాతల సహకారంతో వృద్ధాశ్రమంలో బోరు

అమడగూరు: తనకంటివారిపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి, రామ్మోహన్ సహకారంతో శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమంలో బోరు వేయించినట్లు నిర్వాహకులు అరుణ జ్యోతి ఆదివారం తెలిపారు. ఆశ్రమం ఆవరణలో తాగు నీటి బోరు వేయడంతో పుష్కలంగా నీరు పడడంతో దాతలు హర్షం వ్యక్తం చేశారు. వృద్ధాశ్రమానికి భవిష్యత్తులో ఎలాంటి సహకారమైనా అందిస్తామని దాతలు తెలిపారు. అనంతరం ఆశ్రమం నిర్వాహకులు దాతలను సన్మానించారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

ముదిగుబ్బ : పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 19 మంది విద్యార్థులకు ఆదివారం రాజగోపాల్ మండల పరిధిలోని మలకవేముల క్రాస్‌లో ఉన్న తన కార్యాలయంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 6 జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 6 వేలు, రెండో బహుమతిగా రూ. 5 వేలు, మూడో బహుమతిగా రూ. 4 వేలు చొప్పున నగదు అందజేశామన్నారు. ప్రతిభావంత విద్యార్థులకు సహకారం అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అమడగూరు : ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి లక్ష్మీనరసింహస్వామి కన్‌స్ట్రక్షన్స్ బెంగళూరు యాజమాన్యం ఆదివారం రూ.1,50,000 విరాళం అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణ దాత చేత స్వామి, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మెడిటేషన్ సెంటర్ ప్రారంభం

కొత్తచెరువు: స్థానిక దర్గా వీధిలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మెడిటేషన్ సెంటర్‌ను ఆదివారం ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్రార్థనలు చేసుకుంటూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో జీవించాలని సూచించా రు. అలాగే బ్రహ్మకుమారీల సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యేని వారు సన్మానించా రు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, రిటైర్డ్ టీచర్ శివారెడ్డి, వైసిపి నాయకులు రెడ్డప్పరెడ్డి, నాగరాజు, షాజహాన్, జక్కంపూడి చలపతి, నాగభూషణ్, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే

ధర్మవరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జిల్లా నియంత్రణ విభాగం ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి పట్టణంలో అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన మైత్రి మహిళా సంఘం, స్వచ్ఛంద సంస్థలో ఐసిటిసి కౌన్సిలర్ అరవిందు, వనమాల, భార్గవి. ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ వల్ల మృతి చెందిన వారి ఆత్మకు శాంతికలగాలని కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు గౌస్ పీరా, మహమ్మద్ రఫీ, శక్తి మైత్రి సభ్యులు నిర్వహించారు.


హెచ్ఐవి, ఎయిడ్స్ మృతుల ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దశ్యం

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' ముగింపులో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి ప్రభుత్వంలో హిందూపురం నియోజకవర్గంలో కనీస అభివృద్ధి జరగలేదని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని హిందూపురం పట్టణం, రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో గ్రామాల్లో, పంచాయతీ, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లగా ప్రజల నుంచి విశేషమైన స్పందన, మద్దతు లభించిందన్నారు. ప్రజలతో పూరించిన 40 వేల ఫార్మట్లను కేంద్ర కార్యాలయానికి పంపుతున్నట్లు వెల్లడించారు. ఏ గడపకూ వెళ్లినా ప్రజలు


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రభుత్వంపై వ్యతిరేక తను వెళ్లగక్కుతున్నారన్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు పెద్దఎత్తున తొలగించారని ప్రజలు వాపోయారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఆయా సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు షఫీవుల్లా, రామంజినమ్మ, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు అమర్నాథ్, మారుతి ప్రసాద్, వెంకటేష్, తెలుగు మహిళా కార్యదర్శి పరిమళ, నాయకుల నాగరాజు, రాము, శ్రీనివాసరెడ్డి, ఐటిడిపి, మైనార్టీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి వైఫల్యాలను ఎండగట్టండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని టిడిపి అధికార ప్రతినిధి శ్రీశైలం పురుషోత్తంగౌడ్ పార్టీ శ్రేణులను కోరారు. పట్టణంలోని 31వ వార్డు సత్యసాయినగర్, గిర్రాజు కాలనీల కమిటీలు, ముఖ్యనాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డుల్లో


సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తంగౌడ్

కమిటీలు, బూత్ కన్వీనర్లు, సెక్షన్ ఇన్‌ఛార్జి నియామక కమిటీలను నిర్మాణాత్మకంగా పూర్తి చేసుకుని సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 50 ఇళ్లకు ఒక సెక్షన్ ఇన్‌ఛార్జిని నియమించుకుని ఆ 50 ఇళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం పెన్ ఇన్‌ఛార్జి వద్ద ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాలతో కూడిన బుక్‌లెట్‌ను తయారుచేసి పార్టీ కార్యాలయానికి పంపాలన్నారు. ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ధర్మవరంలో 40 ఏళ్లుగా టిడిపికి గట్టి పునాదులు ఉన్నాయని, ప్రాణాలు అర్పించే కార్యకర్తలూ ఉన్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాయకులు ఫణికుమార్, పరిశే సుధాకర్, నాగూర్‌హుస్సేన్, కేశగాళ్ల శ్రీనివాసులు, సంగాల బాలు, ఉస్మాన్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నేతలు

నాలుగేళ్లలో ఏంచేశారు..?

ఎమ్మెల్యే తిప్పేస్వామికి టిడిపి సూటి ప్రశ్న

ప్రజాశక్తి-మడకశిర రూరల్

నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని టిడిపి నేతలు ఎమ్మెల్యే తిప్పేస్వామిని సూటిగా ప్రశ్నించారు. మడకశిర పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ సుబ్బరాయుడు, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. ఈ నెల 17న గుండుమల తిప్పే స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు విజయవంతం కావడం, ఆ సందర్భంగా మడక శిర పట్టణం జనసంద్రంగా మారడం చూసి తట్టుకోలేని ఎమ్మెల్యే పలమనేరు తిప్పేస్వామి చంద్రబాబు, గుండుమల తిప్పేస్వామిని వ్యక్తిగతంగా విమర్శించ డాన్ని తప్పుపట్టారు. అభివద్ధి గురించి స్థానిక ఎమ్మెల్యే మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడం లా ఉందని విమర్శించారు. నియోజకవర్గంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి విద్వేషాలు రెచ్చగొడుతు న్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో సర్పంచి నారాయణగౌడ్, టిడిపి పట్టణ అధ్యక్షుడు బక్తర్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు టీకా తప్పనిసరి

ప్రజాశక్తి-హిందూపురం

హజ్ యాత్రికులు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ షేక్ గులాబ్ జాన్ సూచించారు. శ్రీసత్య సాయి జిల్లా నుంచి ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు పట్టణంలోని నవాజ్ నర్సింగ్ హోంలో ఆదివారం టీకా, వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గులాబ్ జాన్, జిల్లా రోగ నిరోధక అధికారి డాక్టర్ కృష్ణయ్య,


హజ్ యాత్రికులకు టీకా వేస్తున్న దృశ్యం

మెడికల్ అధికారి డాక్టర్ ఆనంద్ బాబు, విజయవాడ హజ్ కమిటీ నోడల్ అధికారులు గని తస్లీమ్, రిజ్వాన్ అహ్మద్ పాల్గొని యాత్రికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గులాబ్ జాన్ మాట్లాడుతూ సిఎం జగన్, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, హజ్ కమిటీ ఛైర్మన్ గౌస్ లాజం హజ్ యాత్రికుల సంక్షేమం కోసం కషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పెప్సీ ఇర్షాద్ అహ్మద్, మహబూబ్, ఫజలే కరీం, నూర్ షరీఫ్, అయూబ్, ఇలియాజ్, ఫాజిల్, గౌస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి పాలనలోనే మైనార్టీల అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే అత్తార్

ప్రజాశక్తి-అమడగూరు

రాష్ట్రంలో మైనార్టీల అభివద్ధి కోసం అహర్నిశలు కషిచేసిన ఏకైక వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా కొనియాడారు. కదిరి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మైనార్టీలకు సంబంధించిన వక్ఫ్ బోర్డు, దర్గా, ఈద్గా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అత్తార్

స్థలాలను సంరక్షించారని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు మాయమాటలు చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారన్నారు. ఇప్పటికైనా వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకునేందుకు మైనార్టీలను ఏకతాటి పైకి తెచ్చి పెద్ద సమావేశాన్ని ఏర్పాటు చేసి మైనార్టీల అభిప్రాయాలు సేకరించాలని పిలుపునిచ్చారు. మైనార్టీల విద్యార్థుల కోసం మైనార్టీ కాలేజీ నిర్మించిన ఘనత టిడిపికి, మాకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమ్లానాయక్, అలీ, చంద్ర, బాలచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం

ఎన్ఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వంలోకి విలీనమైన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు ఉత్పన్నమైన సమస్యల పట్ల


శ్రీనివాసరావుతో ఎన్ఎంయు నాయకులు

రాజీ లేని పోరాటం చేస్తున్నది ఎన్ఎంయు మాత్రమే అన్నారు. ప్రభుత్వంలోకి విలీనమైన తర్వాత ఉద్యోగులకు దక్కాల్సిన ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు, పనిష్మెంట్లలో మార్పులు ఇప్పించి క్యాడర్ స్ట్రెంత్‌లో డిపోల్లో ఎక్కువ కాబడిన ఉద్యోగుల్లో భయాందోళనలు నివారించి అక్కడే పనిచేసేలా ఉత్తర్వులు ఇప్పించిన ఘనత ఎన్ఎంయుదే అన్నారు. కొన్నేళ్ల పాటు తాత్కాలిక పదోన్నతిపై పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయించామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఉద్యోగులకు ఇబ్బందిగా కలగకుండా ఉత్తర్వులు ఇచ్చేందుకు, సర్వీస్ కండిషన్లో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. త్వరలో ఉద్యోగులందరికీ ఆర్జిత సెలవుల సొమ్ము అకౌంట్లో జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పివి రమణారెడ్డి, ఉపాధ్యక్షులు హరిమోహన్, ఎన్.వెంకటరమణ, రీజినల్ కార్యదర్శి షబ్బీర్, బాబు, మద్దిలేటి, కదిరి డిపో సెక్రటరీ బైరిశెట్టి, హిందూపురం సెక్రటరీ రంగనాథప్ప, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ఎపిఎస్ ఆర్‌టిసిని ప్రభుత్వంలోకి విలీనం చేయడం సంతోషంగా ఉందని, అయితే వాటి ఫలితాలు రావాలంటే పాత పెన్షన్ విధానం అమలు


మాట్లాడుతున్న ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి

చేసినప్పుడే సాధ్యమవుతుందని, వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతో పాటు రాష్ట్ర నాయకులు ఆదివారం పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ముఖ్య నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ పరిస్థితి, కార్మికుల బకాయిలు, ప్రభుత్వంలోకి విలీనమైన అనంతరం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించినారు. త్వరలోనే ఎండి, రవాణాశాఖ మంత్రితో చర్చించి అన్ని సమస్యలు పరిష్కరించడానికి కషి చేస్తామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించక పోతే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమిస్తామన్నారు. వారితో పాటు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు రమణ, శ్రీరామ నాయక్, రాజారెడ్డి, చెన్నారెడ్డి, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా అశ్వర్థప్ప

చిలమత్తూరు: వికలాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మండల పరిధిలోని సంజీవరాయని పల్లికి చెందిన అశ్వర్థప్పను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడు


నియామకపత్రం అందుకుంటున్న అశ్వర్థప్ప

తూ సచివాలయ వ్యవస్థలో భాగమైన వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చడమే ధ్యేయమన్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాడిన ఈ సంఘం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మర్రి కాశీవిశ్వనాథ్(తూర్పుగోదావరి జిల్లా), రాష్ట్ర అధ్యక్షులుగా ఆశ్వర్థప్ప (శ్రీ సత్యసాయి జిల్లా, చిలమత్తూరు), ఉపాధ్యక్షులుగా తన్నేరు రామంజనేయులు (పల్నాడు), సుధా బత్తుల వెంకటేశ్వరరావు (కష్ణా), సంతోష్ అన్సారి (శ్రీకాకులం), మొక్కలకట్టి నాగభూషణం రావు (ఎన్‌టీఆర్)లను ఎన్నుకున్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా..

చిలమత్తూరు : ఉపాధి, వ్యవసాయ కూలీల సమస్యలపై సోమవారం (నేడు) శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పిలుపునాచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించాలి, ఉపాధి హామీ చట్టానికి సరిపడా నిధులు కేటాయించాలి, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చెయ్యాలి, వంద రోజులు పూర్తయిన కూలీలకు పనిముట్లు ఇవ్వాలి, 200 రోజులు పనులు కల్పించాలి, వేసవి అలవెన్స్ లు ఇవ్వాలి, పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలి, దినసరి కూలి రూ. 600 ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పాల్గొంటారని, కావున జిల్లా నలుమూలల నుండి ఉపాధి కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్.కృష్ణయ్యను కలిసిన బత్తల వెంకటరమణ

కదిరి టౌన్ : బిసి నాయకుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కష్ణయ్యను కదిరి నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు డాక్టర్ బత్తల వెంకటరమణ తిరుపతిలో మర్యాదపూ ర్వకంగా కలిశారు. కదిరి నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన వడ్డెర్లకు రాబోయే ఎన్నికల్లో కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానం కేటాయించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లాలని కోరారు.

డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా గౌస్ లాజం



ఓబుళదేవరచెరువు: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా గౌస్ లాజమ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లాజమ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరహరి, రమణయ్య, పురుషోత్తం, జార్జి, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులకు ఆయన ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. లాజమ్‌కు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయక్, రామకష్ణ, వెంకటచలమయ్య, ఎస్‌సి నరసింహులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

మనిషికి క్రమశిక్షణ, సంస్కారం అవసరం : డీఎస్పీ

ప్రజాశక్తి-అమడగూరు

ప్రతి మనిషికి క్రమశిక్షణ, సంస్కారం చాలి అవసరమని, కావున రౌడీ షీటర్లు భవిష్యత్తులో క్రమశిక్షణ, సంస్కారంతో నడుచుకోవాలని డిఎస్పి శ్రీలత సూచించారు. కదిరి డిఎస్పి శ్రీలత అధ్యక్షతన


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్పి శ్రీలత

ఆదివారం కదిరి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్, కేడీ, డీసీలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ రౌడీ షీటర్లుగా నమోదైన వారి వ్యక్తిగత నడవడిక, పరిసరాల ప్రాంతాల వ్యక్తులతో వ్యవహరించిన తీరును బట్టి కేసులు తొలగిస్తామన్నారు. తద్వారా వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలో ఉన్న సిఐలు తమ్మిశెట్టి మధు, శంకరనారాయణ, ఆయా మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు 'పరిటాల రవి' ట్రస్ట్ ప్రోత్సాహం

కనగానపల్లి : క్రీడాకారులకు పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ప్రోత్సాహం అమోఘమని క్రికెట్ టోర్నమెంట్ మండల ఆర్గనైజర్ బట్టా సురేష్ చౌదరి ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ పరిటాల రవీంద్ర జ్ఞాపకార్థం పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాప్తాడు-ధర్మవరం సూపర్ లీగ్ (ఆర్‌డిఎస్ఎల్) మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారన్నారు. టోర్నీలో భాగంగా


క్రీడాకారులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఆదివారం మండల పరిధిలోని ముత్తవకుంట్లలో నాలుగు మ్యాచ్‌లు జరిగా యి. ఈ సందర్భంగా క్రీడాకారులకు పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం, చల్లటి తాగునీరు, ఆట మధ్యలో కూల్ డ్రింక్స్, మజ్జిగ పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ యాతం పోతలయ్య, రాష్ట్ర కార్యాదర్శి నెట్టెం వెంకటేష్, ముకుందనాయుడు, తల్లిమడుగుల సర్పంచి రామాంజి, మాజీ సర్పంచి పథకమూరి ఆంజనేయులు, ఎంపిటిసి బిల్లె భాస్కర్, మనోహర్ నాయుడు, సరిపుటి శీన, టోర్నీ ఆర్గనైజింగ్ సభ్యులు, నాయకులు, పరిటాల అభిమానులు క్రీడాకారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాలివాన బీభత్సం.. గేదె మృతి

పరిగి: మండలంలో గాలివాన బీభత్సానికి పలుచోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. సుబ్బరాయనిపల్లిలో గాలివాన ధాటికి చెట్టు విరిగి పడడంతో పాడి రైతు శ్రీరామప్పకు చెందిన గేదె చనిపోయింది. అలాగే గ్రామంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పరిగి-శ్రీరంగరాజుపల్లి సమీపంలో కాలువపల్లికి చెందిన బాలు ఇటుక బట్టీ షెడ్డు రేకులు గాలికి పైకి లేచి పోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రూ. లక్ష నష్టం వాటినట్లు బాధితుడు తెలిపాడు. ప్రాణహాని తప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


పరిగిలో చెట్టు మీద పడటంతో మృతిచెందిన గేదె

భర్తపై భార్య ఫిర్యాదు

అమడగూరు: మండల పరిధిలోని మమదాబాద్ గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ తన భర్త అమర్నాథ్‌పై ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. అమర్నాథ్ ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి భౌతికంగా దాడి చేస్తున్నారని, కుటుంబం గడవడమే గగనమైన పరిస్థితిలో ఉన్నామని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

అమరాపురం: మహిళా కనిపించడం లేదని ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండల పరిధిలోని బంగారుపాలెం గ్రామానికి చెందిన నాగరాజుతో కర్నాటకలోని కరెక్యతనహల్లి గ్రామానికి చెందిన కెటి లతతో 9 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. లత ఈ నెల 15న పుట్టింటికి పోయి వస్తానని భర్త, అత్తలకు చెప్పి వెళ్లింది. అయితే అప్పటి నుంచి ఆమె ఆచూకీ లేదన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


కెటి. లత

రేషన్ బియ్యం పట్టివేత

ధర్మవరం టౌన్ : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సాయిప్రసాద్, ఎస్ఆర్‌టి యామిని సరస్వతి తెలిపారు. వారు ఆదివారం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్‌లో స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో భాగంగా ఓ వాహనంలో 17,220 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి ముదిగుబ్బ మండలంలోని అడివి బ్రాహ్మణపల్లికి చెందిన రమేశ్ నాయక్, రాప్తాడు మండలం ఎర్రగుంటకు చెందిన బోయ నరసింహులు, కర్నాటకలోని చిక్కబళ్లాపూర్‌కి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డిలను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సిఎస్‌డిటి లక్ష్మీదేవికి అప్పగించామన్నారు.


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్న విజిలెన్స్ అధికారులు

పారిశ్రామికాభివృద్ధికి నాంది పలికిన ఘనత రాజీవ్‌దే

ప్రజాశక్తి-హిందూపురం

దేశంలో పారిశ్రామికాభివృద్ధికి నాంది పలికిన ఘనత దివంగత ప్రధాని రాజీవ గాంధీదే అని కాంగ్రెస్ నాయకుడు బాలాజి మనోహర్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్‌లో ఉన్న రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా బాలాజి మనోహర్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానిగా దేశానికి చేసిన సేవలు మరువలేని వన్నారు. యువతను భారత ఎన్నికల్లో భాగస్వామ్యం చేసి పరిపాలనలో యువత ఉండాలని 18 సంవత్సరాల వయసు కలిగిన వారందరికీ ఓటు హక్కు కల్పించిన, దూరదృష్టి కలిగిన గొప్ప నాయకుడు అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు నాయకత్వం కల్పించి మహిళా రిజర్వేషన్ తీసుకొచ్చినటువంటి గొప్ప సంస్కరణవేత్త అన్నారు. కార్యక్రమంలో యూనుస్, జమీల్, మహబూబాషా, రఫూఫ్, అజ్మతుల్లా, ముబారక్, రఫీక్, గౌస్ పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

అమడుగూరు : భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిఎస్ అహ్మద్‌హుసేన్ ఆధ్వర్యంలో కదిరి పట్టణంలో రాజీవ్ గాంధీ చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా ఉత్తమమైన పరిపాలన అందించారన్నారు. ఆయన హయాంలో కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు చేశారని, అలాగే దేశాన్ని అభివద్ధి దిశగా తీసుకెళ్లార న్నారు. ముఖ్యంగా 400 ఎంపి స్థానాలకు పైగా గెలుచుకుని ప్రపంచంలోనే అతి పిన్న వయసులో ప్రధాని అయ్యారన్నారు. ఇప్పటివరకూ ఏ రాజకీయ పార్టీకి రాని ఎంపి స్థానాలు కాంగ్రెస్ పార్టీకి వచ్చాయంటే రాజీవ్ గాంధీ ఎంత కష్టపడ్డారో తెలిసిపోతుందన్నారు. దేశానికి ఐటి రంగాన్ని పరిచయం చేసి, అభివద్ధిలో భారత్ దూసుకుపోయేలా పరిపాలన చేసిన వ్యక్తి అన్నారు. చివరికి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో నచ్చు బాలకష్ణ యాదవ్, పారేషు, రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఓబుళదేవరచెరువు: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండల పరిధిలోని కొండకుమర్ల పంచాయతీలో పోలేవాండ్ల - కొత్తపల్లి గ్రామరోడ్డును ప్రారంభించారు. అలాగే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. అలాగే ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఉన్నది మీ కోసమని, జగనన్న పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అధికారులు, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, ఎంపిపి పర్వీన్‌బాను, వైసిపి మండల కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కష్ణారెడ్డి, సర్పంచిలు గోవిందు, రామచంద్రారెడ్డి, షాజియా, వెంకటరమణ, ప్రజాప్రతినిధులు షామీర్‌బాషా, లక్ష్మిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులురెడ్డి, వైసిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పోలేవాండ్ల -కొత్తపల్లి గ్రామరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ

అమడగూరు : కదిరి పట్టణంలోని కెఎల్ఎన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్‌లో నర్సరీ నుంచి 8వ తరగతి వరకు(2023-24 విద్యా సంవత్సరం కొరకు) తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు ఉచితంగా చదువు చెప్పనున్నట్లు డైరెక్టర్ రమేష్ తెలిపారు. 8 ఏళ్ల పైబడిన విద్యార్థులు అర్హులన్నారు.